క్లుప్తంగా

నేత్రపర్వంగా పల్లకిసేవ



పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో గల శ్రీలక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి, అమ్మవార్ల పల్లకిసేవను వేడుకగా శనివారం నిర్వహించారు. విశేషాలంకారంలో స్వామివారు దర్శనమిచ్చారు. భక్తులకు ప్రసాదాలను అందజేశారు.

లారీని ఢీకొన్న కారు

• నలుగురికి గాయాలు



నుజ్జునుజ్జయిన కారు

మనుబోలు: లారీని కారు ఢీకొనడంతో నలుగురు గాయపడిన ఘటన మండల పరిధిలోని జాతీయ రహదారిపై కొండూరుసత్రం సమీపంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. బాపట్లకు చెందిన ఓ కుటుంబం కారులో తిరుపతి వెళ్లి తిరిగి బయల్దేరారు. ఈ క్రమంలో కొండూరు సత్రం – కొమ్మలపూడి క్రాస్‌రోడ్డు సమీపంలో లారీ ఉన్నట్లుండి స్లో కావడంతో కారు ఢీకొంది. కారు ముందుభాగం నుజ్జునుజ్జు కాగా, అందులో ప్రయాణిస్తున్న నలుగురు స్వల్పంగా గాయపడ్డారు. వీరి వివరాలు తెలియరాలేదు. కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా సైన్స్ దినోత్సవం



కోవూరు : స్థానిక రత్నం ఉన్నత పాఠశాలలో సైన్స్ దినోత్సవాన్ని రెండో రోజు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నూతన ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు మెడికల్ క్యాంప్ నిర్వహించారు. అనంతరం హెచ్‌ఎం నరేంద్రబాబు మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ పరిజ్ఞానం పెంపొందించుకోవాలని సూచించారు. క్విజ్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.


8 నుంచి భాగవత సప్తాహం



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో గల లక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో భాగవత సప్తాహాన్ని ఈ నెల ఎనిమిది నుంచి 15 వరకు నిర్వహించనున్నామని దేవస్థాన నిర్మాణ కమిటీ అధ్యక్షుడు పెంద్యాల రమణయ్యనాయుడు పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను దేవస్థానంలో శనివారం ఆవిష్కరించారు.

శివయ్యను తాకుతున్న సూర్యకిరణాలు



పొదలకూరు: మండలంలోని మరుపూరులో గల కామాక్షి సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో శివలింగాన్ని ప్రభాత వేళ సూర్యకిరణాలు తాకుతున్నాయి. చారిత్రక ప్రాశస్త్యం కలిగిన దేవస్థానాన్ని గ్రామపెద్దలు రెండేళ్ల క్రితం పునర్నిర్మించారు. మహాశివరాత్రి మహోత్సవాల సందర్భంగా ఉదయం 6.55 నుంచి ఏడు వరకు శివలింగంపై సూర్యకిరణాలు పడుతున్నాయి. వైస్ ఎంపీపీ, గ్రామ పెద్ద వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకం



ఇందుకూరుపేట : ఎస్సీ వర్గీకరణ సాధన కోసం జరిగిన ఉద్యమంలో అశువులు బాసిన మాదిగ అమరవీరులను మాదిగ జాతి మర్చిపోదని, వారి త్యాగాలు స్ఫూర్తిదాయకమని ఎంఎస్పీ జాతీయ నాయకుడు గొల్లపల్లి శ్రీనివాస్ మాదిగ అన్నారు. మండలంలోని మైపాడులో మాదిగ అమరవీరుల సంస్మరణ సభ శనివారం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ వారి త్యాగాలు వృథా కావన్నారు. తొలుత వారి చిత్రపటానికి నివాళులర్పించారు.

నిరంతరం ప్రజలతోనే..

• మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: అధికారం ఉన్నా, లేకపోయినా నిరంతరం ప్రజలతోనే ఉంటానని.. ఎవరూ అధైర్యపడొద్దని.. కార్యకర్తలకు అండగా పార్టీ నిలుస్తుందని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. పొదలకూరు పట్టణంలో శనివారం పర్యటించిన ఆయన కార్యకర్తలతో ముచ్చటించి రాజకీయ పరిణామాలపై ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావడం ఖాయమని చెప్పారు. మన ప్రభుత్వమొచ్చిన వెంటనే కార్యకర్తలు, నేతల కష్టాలు దూరమవుతాయని భరోసా ఇచ్చారు. అనంతరం కోడూరు శ్రీనివాసులు కుమార్తె వివాహ వేడుకలకు హాజరయ్యారు. పార్టీ మండలాధ్యక్షుడు పెదమల్లు రమణారెడ్డి, మాజీ ఎంపీపీ కోనం చినబ్రహ్మయ్య, తుమ్మల ప్రసాద్, తుమ్మల శ్రీనివాసులు, వెంకటకిశోర్, కోడూరు మస్తాన్, ఎంపీటీసీలు కేతు రామిరెడ్డి, గుంటి శ్రీనివాసులు, శేఖర్‌బాబు, మద్దిరెడ్డి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

విద్యతోనే అభివృద్ధి సాధ్యం

కొడవలూరు : విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని జిల్లా గిరిజన సంక్షేమాధికారి పీబీకే పరిమళ సూచించారు. కొడవలూరు గిరిజన బాలుర గురుకుల పాఠశాల వార్షికోత్సవ వేడుకకు శనివారం ఆమె విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజన పిల్లలు చదువుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని వసతులు కల్పిస్తున్నందున సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం గతేడాది పదో తరగతిలో గురుకులంలో ప్రథమ స్థానం సాధించిన కామంచి దేవేశ్‌కు ప్రిన్సిపల్ పి.దేవసహాయం తన సతీమణి దయావాణి జ్ఞాపకార్థం రూ.10,116లను అందజేశారు. చివరిగా విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గురుకులాల సహాయ కార్యదర్శి నటరాజ్, వివిధ గురుకులాల ప్రిన్సిపల్స్ టి.విష్ణుప్రియ, ఎస్.శ్యామ్‌వర్ధన్, వైస్ ప్రిన్సిపల్ మహమద్, ఎస్‌ఎంసీ చైర్‌పర్సన్ రాజేశ్వరి పాల్గొన్నారు.



వార్షికోత్సవ వేడుకల్లో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న పరిమళ

రూ.82 వేల రికవరీకి ఆదేశం

కోవూరు : మండల పరిధిలో గత ఆర్థిక సంవత్సరంలో రూ.4.18 కోట్లతో చేపట్టిన వివిధ పనులకు సంబంధించిన సోషల్ ఆడిట్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా డ్వామా పీడీ గంగాభవాని పాల్గొని, మాట్లాడారు. మొత్తం రూ.82 వేలకు సంబంధించి రికార్డులు సక్రమంగా లేవని, దీనిని రికవరీ చేయాలని ఆదేశించారు. అయితే గంగవరం గ్రామానికి చెందిన హెల్త్ సెంటర్‌కు సంబంధించిన రూ.4 లక్షల బిల్‌ను సరైన సమయంలో అందించలేదు. దీనిపై ఆమె ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో విజిలెన్స్ అధికారి విజయలక్ష్మి, ఎంపీపీ పార్వతి, సర్పంచ్‌లు లక్ష్మీకుమారి, ప్రమీలమ్మ పాల్గొన్నారు

టీఏపై పలు ఆరోపణలు

ఉపాధిహామీ పథకంలో టీఏగా పనిచేసిన సుబ్బారావుపై మొదటి నుంచే ఆరోపణలు వస్తున్నాయి. ఎక్కడ మస్టర్లు వేసినా అందులో తన వాటా పంపాలని కోరేవారని బహిరంగ సమావేశానికి వచ్చిన ప్రజలు, ఫీల్డ్ అసిస్టెంట్లు చర్చించుకున్నారు.

రికార్డులను మరోసారి పర్యవేక్షించాలి

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలో 2023–24 సంబంధించిన రూ.5.20 కోట్ల పనులకు రూ.90,992 అవినీతి జరిగినట్లు రికవరీకి ఆదేశించామని డ్వామా పీడీ గంగాభవాని తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెం మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ పనులకు సంబంధించి రికార్డులు సమర్పించకపోవడంతో ఆ రికార్డులను మరోసారి చూడాలన్నారు.

రీసెర్చ్ మెథడాలజీపై సదస్సు

కోవూరు : గంగవరంలోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో 'రీసెర్చ్ మెథడాలజీ – ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ (ఐపీఆర్)'పై అవగాహన సదస్సు ప్రారంభమైందని ప్రిన్సిపల్ సందీప్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలోని వివిధ కళాశాలల నుంచి 300 మంది ప్రొఫెసర్లు హాజరై, సూచనలు చేశారన్నారు. ఈ సదస్సు ఐదు రోజుల పాటు ఉంటుందన్నారు.

విద్యార్థులకు అవగాహన

కోవూరు : లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ట్రెయినీ డీఎస్పీ శివప్రియ పాల్గొని, పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ ఇన్‌చార్జి డాక్టర్ కె.విజయ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సందీప్‌కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి వై.మురళీకృష్ణ, వివిధ విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పక్కాగా మోటార్ వాహన చట్టం అమలు

• ఉల్లంఘిస్తే జరిమానాలు, లైసెన్స్‌లు రద్దు

నెల్లూరు(క్రైమ్): రహదారి ప్రమాదాల్లో ప్రాణ నష్టం తగ్గించేందుకు హైకోర్టు ఆదేశాల మేరకు మోటార్ వెహికల్ చట్టాన్ని జిల్లాలో మార్చి 1వ తేదీ నుంచి పటిష్టంగా అమలు చేస్తోంది. నిబంధనలను ఉల్లంఘిస్తే సవరించిన జరిమానాలు విధించడంతో పాటు పదేపదే ఉల్లంఘనకు పాల్పడితే డ్రైవింగ్ లైసెన్స్‌లను సైతం రద్దు చేయనున్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణలో పోలీసులకు వాహనదారులు సహకరించాలని ఎస్పీ కృష్ణకాంత్ కోరారు. ద్విచక్రవాహనచోదకుడితో పాటు వెనుక కూర్చున్న వారూ హెల్మెట్‌ను విధిగా ధరించాల్సి ఉంటుంది. ఇతర వాహనాలు నడిపే వారితో పాటు కో ప్యాసింజర్ సైతం సీటు బెల్టును ధరించాలి. విధి నిర్వహణలో ఉన్న పోలీస్, రవాణా శాఖ అధికారులతో గొడవకు దిగినా, సమాచారమిచ్చేందుకు నిరాకరించినా కేసులు నమోదు చేయనున్నారు.

పెనాల్టీలిలా..

ఉల్లంఘన	సవరించిన జరిమానా (రూపాయల్లో)
హెల్మెట్ లేకపోతే	1000
వెనుక కూర్చున్న వ్యక్తికి లేకపోతే	1000
లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే	5000
ఇన్సూరెన్స్ సర్టిఫికెట్ లేకపోతే	2000 (మొదటిసారి), 4000 (రెండోసారి)
పొల్యూషన్ సర్టిఫికెట్ లేకపోతే	1500
సెల్‌ఫోన్ డ్రైవింగ్	1500 (మొదటిసారి), 10000 (రెండోసారి)
నంబర్ ప్లేట్ సక్రమంగా, వాహన పత్రాల్లేకపోయినా	150 (మొదటిసారి), 300 (రెండోసారి)
సీటుబెల్ట్ ధరించకపోతే	1000
రిజిస్ట్రేషన్ లేకపోయినా, రెన్యువల్ చేయకపోయినా, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకపోయినా	2000 (మొదటిసారి), 5000 (రెండోసారి)
రేసింగ్	5000 (మొదటిసారి), 10000 (రెండోసారి)
మితిమీరిన వేగం	1000
ట్రిపుల్ రైడింగ్	1000

భారీ వాహనాల అడ్డగింత

ముత్తుకూరు: టిప్పర్లు, బల్కర్లు తదితర భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో విసుగెత్తిన పంటపాళెం గ్రామస్తులు రోడ్డుపై శనివారం బైఠాయించారు. వాహనాలను సీపీఐ నేత ఏడుకొండలు తదితరుల ఆధ్వర్యంలో అడ్డుకున్నారు. ఓ బాలికను భారీ వాహనం శుక్రవారం ఢీకొనడం గ్రామస్తులను ఆగ్రహానికి గురిచేసింది. దీంతో వెంకటాచలం, రామదాసు కండ్రిగ, ముత్తుకూరు వైపు వెళ్లే వాహనాలు నిలిచిపోయారు. ముత్తుకూరు, కృష్ణపట్నం ఎస్సైలు విశ్వనాథరెడ్డి, శ్రీనివాసరెడ్డి ఘటన స్థలానికి చేరుకొని నిరసన చేస్తున్న వారితో మాట్లాడారు. చికిత్స పొందుతున్న బాలిక వైద్య ఖర్చులు చెల్లించేలా.. రెండు నెలల్లో భారీ వాహనాల దూకుడుకు కళ్లెం వేసేలా చర్చలు జరుపుతామని హామీ ఇచ్చి ఆందోళనను విరమింపజేశారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న విశ్వనాథరెడ్డి

కమనీయం కల్యాణం

బుచ్చిరెడ్డిపాళెం : స్థానిక రామకృష్ణ నగర్‌లో ఉన్న కల్యాణ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారి కల్యాణం శనివారం కమనీయంగా సాగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా టీటీడీ అర్చకుల ద్వారా కల్యాణ ఘట్టాన్ని జరిపించారు. ఎత్తున భక్తులు పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. రాత్రి స్వామివారు గజవాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు.

నేడు రథోత్సవం...

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రథోత్సవాన్ని నిర్వహించనున్నారు. భారీ సంఖ్యలో భక్తులు రానుండడంతో చలివేంద్రాలు, అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు.



కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు

వ్యక్తి మృతిపై కేసు నమోదు

ఇందుకూరుపేట : మండలంలోని గంగపట్నం గిరిజన కాలనీకి చెందిన పురిటి వెంకటరమణయ్య(47) అనే వ్యక్తి మృతిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. వెంకట రమణయ్య శుక్రవారం రాత్రి ఇంటి నుంచి వచ్చాడు. ఉదయం నరసాపురంలో పాతసామన్లను కొనే దుకాణం సమీపంలో పడి ఉన్నారు. దీంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు ఎస్సై నాగార్జునరెడ్డి తెలిపారు. కాగా ఆయన మృతికి గల కారణాలు తెలియరాలేదు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు.



మృతిచెందిన వెంకట రమణయ్య

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

పొదలకూరు: ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షను 620 మంది రాశారు. విజ్ఞాన్, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎస్సై హనీఫ్ పరిశీలించారు.

తోటపల్లిగూడూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. తొలి రోజు 274 మందికి గానూ 14 మంది గైర్హాజరయ్యారని ప్రిన్సిపల్, చీఫ్ సూపరింటెండెంట్ ధనుంజయ్‌కుమార్ తెలిపారు. సీసీ కెమెరాల నీడన 13 గదుల్లో పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నామని చెప్పారు. ఎస్సై వీరేంద్రబాబు పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు.

పోలంరాజుగుంటలో జేడీ పర్యటన



ముత్తుకూరు: మండలంలోని పోలంరాజుగుంటలో మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు శనివారం పర్యటించారు. నకిలీ సీడ్‌ను కొనుగోలు చేసి నష్టపోయిన రైతులతో మాట్లాడారు. చెరువుల్లో ఎదుగుదల కోల్పోయిన రొయ్యలను పరిశీలించారు. నకిలీ సీడ్‌ను ఎక్కడ.. ఎప్పుడు కొనుగోలు చేశారనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. నకిలీ సీడ్‌తో ఎంత మంది నష్టపోయారు, నష్టం ఏ స్థాయిలో జరిగిందనే అంశాన్ని ఆరాతీశారు. విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చారు.

పరిశుభ్ర గ్రామాలే లక్ష్యం



మాట్లాడుతున్న రమణయ్య

మనుబోలు: పరిశుభ్రమైన గ్రామాలే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నెల్లూరు డీఎల్పీఓ పుట్టా రమణయ్య పేర్కొన్నారు. మనుబోలులో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో శనివారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడారు. తడి.. పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి ఆయా పంచాయతీల పరిధిలోని చెత్తతో సంపద తయారీ కేంద్రాలకు తరలించాలని సూచించారు. అక్కడ చెత్తను కంపోస్ట్ ఎరువుగా మార్చి దాన్ని రైతులకు విక్రయించడం ద్వారా పంచాయతీలు ఆదాయాన్ని పొందవచ్చని చెప్పారు. ఈఓపీఆర్డీ నారాయణ, మనుబోలు పంచాయతీ కార్యదర్శి గరుడయ్య తదితరులు పాల్గొన్నారు.

కళాశాలపై చర్యలకు వినతి

వెంకటాచలం: నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థుల నుంచి అక్రమంగా ఫీజులు వసూలు చేస్తున్న నగరంలోని ఓ డిగ్రీ కళాశాలపై చర్యలు చేపట్టాలని సింహపురి చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బాబీ భగత్ డిమాండ్ చేశారు. కాకుటూరులోని వీఎస్‌యూలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ సునీతకు వినతిపత్రాన్ని శనివారం అందజేశారు.

పరీక్షలకు 170 మంది హాజరు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో శనివారం నిర్వహించిన డిగ్రీ రెండో, ఐదో సెమిస్టర్ మెగా సప్లిమెంటరీ పరీక్షలకు 170 మంది విద్యార్థులు హాజరయ్యారని పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ వెంకట్రాయులు తెలిపారు. 177 మందికి గానూ ఏడుగురు గైర్హాజరయ్యారని చెప్పారు.

వేడుకగా అశ్వవాహనోత్సవం



కొడవలూరు : గండవరంలో కొలువైన ఉదయకళేశ్వరస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి అమ్మవార్లకు శనివారం రాత్రి అశ్వవాహనోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అర్చకుడు బండారు సుబ్రహ్మణ్యం, ఆలయ చైర్మన్ ఆలం మాలకొండయ్య, ఈఓ బండి శాంతయ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బాగా చదువుకోవాలి



రామన్నపాలెంలో కిశోర బాలికలతో ర్యాలీ

కొడవలూరు : గిరిజన బాలికలు బాగా చదువుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.నిర్మల సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండలంలోని రామన్నపాళెం గిరిజన కాలనీలో కిశోర బాలికలతో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన బాలికలు విద్యకు దూరంగా ఉంటున్నారని, ప్రతిఒక్కరూ పాఠశాలల్లో చేరాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఐ.రోజా, పావని పాల్గొన్నారు.

బొడ్డువారిపాళెంలో..

మండలంలోని బొడ్డువారిపాలెం గిరిజన కాలనీలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమాన్ని శనివారం నిర్వహించి కిశోర బాలికలు తప్పక చదువుకుని అభివృద్ధి చెందాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.నాగభూషణమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పి.మధుసూదనమ్మ, కె.ఎస్తేరమ్మ, కె.సునీత, ఎ.హరిప్రియ పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను నిర్వహించాలి



కొడవలూరు : గిరిజన ప్రాంతాల్లో వైద్య శిబిరాలను నిర్వహించి గిరిజనులకు ఉచిత వైద్య సేవలందించాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కోరారు. మండలంలోని నార్తురాజుపాళెంలో సింహపురి వైద్యసేవా సమితి ఆధ్వర్యంలో జయభారత్ హాస్పిటల్ వారు నిర్వహించిన వైద్య శిబిరాన్ని శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలన్నారు. తొలుత ఆలూరుపాడు, రెడ్డిపాళెంలలో సామాజిక పింఛన్‌లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఎమ్మెల్యే తనయుడు డాక్టర్ అర్జున్‌రెడ్డి, సింహపురి వైద్య సేవా సమితి ట్రస్టీలు ఏవీ సుబ్రహ్మణ్యం, కృష్ణారెడ్డి, హరికుమార్‌రెడ్డి, స్థానిక నాయకులు ఎం.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కె.మల్లికార్జున, బి.విశ్వనాథ్, టి.ప్రవీణ్‌కుమార్, నక్కా రమణయ్య, వెంకీ పాల్గొన్నారు.

ఉదయకళేశ్వరుని హుండీ కానుకల లెక్కింపు



కొడవలూరు : మండలంలోని గండవరంలో కొలువైన గంగా పార్వతి సమేత ఉదయకళేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో హుండీ ద్వారా వచ్చిన కానుకలను దేవదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో శనివారం లెక్కించారు. హుండీల ద్వారా రూ.2,83,458లు వచ్చింది. గతేడాదితో పోల్చుకుంటే రూ.26,779ల ఆదాయం పెరిగింది. దేవదాయశాఖ ఈఓ జి.రమణారెడ్డి పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఆలం మాలకొండయ్య, ఈఓ బండి శాంతయ్య, అర్చకుడు పరాంకుశం శ్రీనివాసాచార్యులు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వెంకయ్యస్వామికి పూజలు



మనుబోలు: మండల పరిధిలోని బీసీ కాలనీ సమీపంలో గల వెంకయ్యస్వామి మందిరంలో విశేష పూజలను శనివారం నిర్వహించారు. పంచామృతాభిషేకం తదితర పూజలను అర్చకుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిపారు. అన్నప్రసాదాన్ని మధ్యాహ్నం అందజేశారు. ఉభయకర్తలుగా గంధళ్ల కృష్ణయ్య, అన్నపూర్ణమ్మ దంపతులు వ్యవహరించారు.